"నాన్నా! వంటయింది. భోజనానికొస్తారా?" వంటింట్లోంచే గట్టిగా పిల్చింది దేవకి.

"ఆఁ వస్తున్నానమ్మా! ఈజీఛైర్‌లో పడుకుని ఏదో ఆలోచిస్తున్న రామ్మూర్తి కూతురు పిలుపుతో ఈ లోకంలోకొచ్చాడు.

దేవకి తండ్రికి వడ్డించింది. ఆయన కూర్చుంటూ—

"అదేమిటమ్మా!... నువ్వు పెట్టుకోలేదేం?" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఏమిటో! నాకు ఆకలిగా లేదు నాన్నా!.. కాసేపాగి తింటాను!" మెల్లగా అంది దేవకి.

"ఆకలిగా లేకపోవడం ఏమిటమ్మా!... అప్పుడే పన్నెండయింది!....ఆకలైనంతే తిందువుగాని కూర్చో!" అన్నాడు రామ్మూర్తి.

"లేదు నాన్నా!....పొద్దుట్నుంచీ కడుపులో బాగాలేదు. నేనో గంటాగి తింటాను మీరు తినేసెయ్యండి!" అంది దేవకి.

ఓసారి కూతురి మొహంలోకి సూటిగా చూశాడాయన. ఆమె ఏదో తప్పు చేసినట్టు తల దించుకుంది.

రామ్మూర్తికి బియ్యం అయిపోయాయని నిన్న కూతురు చెప్పడం గుర్తొచ్చింది.

"దేవకీ!" అన్నాడు మెల్లగా.

"ఏమిటి నాన్నా!"

"ఉన్న అన్నమే ఇద్దరం సర్దుకు తిందాం రామ్మా!"

"నాన్నా!"

"నాకు తెలుసమ్మా!...ఇవాళనీకెందుకు ఆకలి గాలేదో! అయినా యింట్లో వున్నది ఇద్దరం! అలవాటుకి విరుద్ధంగా విడివిడిగా తినడం ఎందుకు!" అదోలా నవ్వాడాయన.

దేవకి కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి.

"బియ్యం రేపు ఆ షావుకార్నే బ్రతిమాలి తెస్తాలే! కంచం తెచ్చుకో!" అన్నాడు రామ్మూర్తి.

దేవకి మౌనంగా వెళ్ళి మరో కంచం తెచ్చి పెట్టుకుంది. తన కంచం లోని అన్నం కాస్త తీసి కూతురి కంచంలో పెట్టాడు రామ్మూర్తి.


ఎంత ఆపుకుందామన్నా ఆగని కన్నీరు టపటప మంటూ కంచంలో రాలి దేవకి అన్నాన్ని తడిపేశాయి.

కాస్త ఆవకాయ, నీళ్ళమజ్జిగతో ఇద్దరూ భోజనం అయిందనిపించారు.

తన కంట నీరు తండ్రి కంట పడకూడదని విశ్వప్రయత్నం చేస్తోంది దేవకి.

చెయ్యి కడుక్కుని మళ్ళీ వెళ్ళి పడక్కుర్చీలో వాలి పోయాడు రామ్మూర్తి.

కంచాలు తీసి వంటిల్లు సర్ది తడి చేతుల్ని కొంగుకి తుడుచు కుంటూ హాల్లోకొచ్చింది దేవకి. అప్పటికే తండ్రి నిద్రలోకి జారుకున్నాడు అలా అర్థాకలితోనే.



తండ్రికేసి పరిశీలనగా చూసింది దేవకి. లోతుకు పోయిన చెంపలు. గుంటలు పడ్డ కళ్ళు. నారపీచులా వుండి తైల సంస్కారం లేనట్టున్న జుట్టు చూస్తుంటే మళ్ళీ ఆమె కంట్లో నీటితెర వెలిసింది.

వయసుకు మించిన వార్ధక్యం కనిపిస్తోందాయనలో. దేవకికి గతం ఒక్కసారి సినిమా రీల్లా గోచరించింది.

* * *

రామ్మూర్తి ఓ పేద బడి పంతులు. మంచిటీచర్‌గా పేరు ప్రఖ్యాతులున్నాయి. వ్యక్తిగతంగా అతిమంచివాడు. అన్నబిరుదు కూడా వుంది.

అయితే అతనికి లక్ష్మీ కటాక్షమే లేదు! అందుకే.... చాలా మంది టీచర్స్‌లా ట్యూషన్స్ మీద సంపాదించలేక.... అలా నిరు పేదగా మిగిలి పోయాడు.

ఎంతో మందికి ట్యూషన్స్ చెప్పాడు. అయితే డబ్బు తీసుకునే వాడు కాదు. అందుకే తనకంటూ ఏమీ మిగుల్చుకోలేక పోయాడు. కనీసం పెద్దలిచ్చిన పెంకుటింటిని బాగు చేయించు కొనడానిక్కూడా శక్తి లేక అలాగే కాలక్షేపం చేశాడు.

పేద బడిపంతులు కుండవలసిన లక్షణాలన్నీ రామ్మూర్తికున్నా. అధిక సంతానం మాత్రం లేదు.

ఆయనకి ఒకే కూతురు, ఒకే కొడుకు కూతురికి చిన్న తనంలోనే తమ సంబంధం చూసి పెళ్ళి చేసేడు. కొడుకుని గ్రాడ్యుయేట్‌ని చేశాడు. బాధ్యత తీరిందని తేలిగ్గా ఊపిరి తీసుకున్నాడు.

ఆ ఆనందంలోనే మరో ఆనందం!

అదే కొడుక్కి రాజధానిలో ఉద్యోగం రావడం!


"చదువులు పూర్తయినా, ఏళ్ళ తరబడి ఉద్యోగం లేక.... నిరాశతో కృంగిపోయే లక్షలాది మంది పట్టభద్రులున్న ఈ దేశంలో అంత తేలిగ్గా ఉద్యోగం రావడం ఎంత అదృష్టం!" అనుకుని మురిసి పోయాడు.

"నాకేం!....నేనింక హాయిగా విశ్రాంతంగా ఉండవచ్చు!" అనుకున్నాడు.

అయితే....ఆ హాయి ఎక్కువ సేపు

# కేట్రాక్ట్

రావినూతల సువర్ణకన్నన్




నిలవలేదు. కొడుకు అక్కడే ఓ కులంగాని అమ్మాయిని పెళ్ళిచేసుకుని తండ్రితో పూర్తిగా తెగతెంపులు చేసుకున్నాడు.

రామ్మూర్తి కృంగిపోయాడు.

భార్య గుండెలు బాదుకుంది.

అయినా కాలం ఆగలేదు. అలా సాగిపోతూనే ఉంది. ఇంతలో హఠాత్తుగా మరో పిడుగులాంటి వార్త.

అదే యాభై అయిదేళ్ళకే రిటయిర్‌మెంట్ !

ఆ లెఖ్ఖ ప్రకారం రామ్మూర్తి మరో నెలకల్లా రిటయిరయి పోయాడు. అతని మీద? అతని లాంటి మరికొందరి మీదా జాలిపడి—

"పాపం !.... అలిసి పోయారు! రెస్ట్ తీసుకోండి!" అంది ప్రభుత్వం.

రామ్మూర్తి మరింత కృంగిపోయాడు.

మరో నెలకల్లా మరో భూకంపం !

అల్లుడు ఏదో యాక్సిడెంట్‌లో కాలం చేశాడు. 'కష్టాలు ఒంటరిగా రావంటారు ఇదే నేమో!' అనుకుని అల్లాడిపోయాడు రామ్మూర్తి.

"ఏమిటయ్యా నీ లీలలు?.... మేం చేసిన పాపమేమిటి? ఎందుకయ్యా మాజీవితాలతో ఇలా ఆడుకుంటున్నావ్?" అంటూ ఒణుకుతున్న చేతులు జోడించి గోడనున్న వెంకన్నని నిలదీశాడు.

ఆయన మామూలుగానే—

"నా లీలలు నీకర్థం కావులే!" అన్నట్టు నవ్వాడు.

మరో పదిహేను రోజులకల్లా దేవకి విధవగా పుట్టిల్లు చేరుకుంది.

వీటన్నింటికీ తట్టుకోలేని రామ్మూర్తి భార్య కొన్నాళ్ళు మంచంలో ఉండి శాశ్వతంగా కన్నుమూసి. భర్తని.బిడ్డని మరింత కృంగదీసింది.

విషయం విని చుట్టంచూపుగా వచ్చి వెళ్ళిపోయాడు కొడుకు.

కాలం మాన్పలేని గాయం ఉండదు.

తండ్రీ కూతుళ్ళు కాస్త తేరుకున్నారు. అలవాటు కాకపోయినా ట్యూషన్స్ చెప్పి కాస్త సంపాదిస్తున్నాడు రామ్మూర్తి.

అది, పెన్షన్ డబ్బు కలిపి గుట్టుగా కాలం నెట్టుకొస్తోంది దేవకి.

కాలం సాఫీగానే గడిచి పోతోంది.

అయితేఇటీవలరామ్మూర్తికళ్ళుకేట్రాక్ట్ మూలంగా సరిగ్గా కనిపించడం లేదు. డాక్టర్ కి చూపిస్తే ఓ కన్నుకు ఆపరేషన్ చెయ్యొచ్చనీ, మరో కన్నుకి ఇంకా టైం పడుతుందనీ అన్నాడు.

ఈ మధ్య కళ్ళతో మరీ ఇబ్బందిగా ఉంది రామ్మూర్తికి. ట్యూషన్స్ కూడా తగ్గి పోయాయి.

ఇప్పుడుఅర్జంటుగా ఆపరేషన్ చేయించుకోవాలి అదే ప్రస్తుతం పెద్ద సమస్యయి కూర్చుంది.

"అమ్మా! దేవకీ.... కాసిని మంచి నీళ్ళియ్యి తల్లీ!" అన్న తండ్రిమాటకి ఈ లోకంలో కొచ్చింది దేవకి గతంలోంచి. మంచినీళ్ళు తెచ్చి తండ్రి కందించి.... అలాగే నిల్చుండి పోయింది.

*   *   *

"ఏమ్మా?" కూతురి మొహంలోని భావాలు చదివిన రామ్మూర్తి చిన్నగా నవ్వుతూ అన్నాడు.

"నాన్నా నాకు చిన్నతనంలోనే పెళ్ళి చెయ్యకుండా కాస్తోకూస్తో చదువుచెప్పిస్తే నేను మీకింత బరువయ్యేదాన్ని కాదు. పైగా నీకూ్కడ కాస్త అండగా ఉండే దాన్ని" కళ్ళు తుడుచుకుంటూ ఆవేదనగా అంది దేవకి.

"నాకు బరువేమిటమ్మా! నేను మాత్రం బతకద్దూ? అయినా వాడి లీలలు మనకర్థం కావమ్మా! ఏది ఎందుకు చేస్తాడో ఆ పరమాత్మకే తెలుసు!" పెదవులు నవ్వుతున్నా కళ్ళు ఏడుస్తూనే ఉన్నాయి.

"ఆ! ఈ గొడవలకేంగానీ ఇంతకీ ఆపరేషన్ ఎక్కడ చేయించు కుంటారు?" మాట మార్చింది దేవకి.

"అదే చూస్తున్నానమ్మా! మన పక్క ఊళ్ళో ఏదో క్లబ్ వారు ఐ కేంప్ పెట్టి ఆపరేషన్స్ చేయించడమేగాక జోడుకూడా ఇస్తారట!....మన స్థితిఅంతంత మాత్రమే కదా!.... అందుకే అక్కడి కెళదామనుకుంటున్నాను. ఈ చూపు కాస్త మెరుగయిందా మనకింక ఇన్ని బాధ లుండవు తల్లీ!" అన్నాడు రామ్మూర్తి.

'అవును!' అన్నట్టు తలూపింది దేవకి.

*   *   *

అనుకున్నట్టుగానే పక్క ఊరు వెళ్ళాడు రామ్మూర్తి. అక్కడంతా హడావుడిగా వుంది. జనం కిట కిట లాడిపోతున్నారు.

పొద్దున్ననగా రావలసిన డాక్టర్ ఏ కారణంచేతో రాలేదు సాయంత్రం అవుతున్నా.

రామ్మూర్తికి నీరసంతో కళ్ళు తిరుగుతున్నాయి. అక్కడి వాళ్ళని ఇద్దరు ముగ్గుర్ని పలకరించాడు.డాక్టర్ విషయం అడగడానికి. అయితే ఎవరూ అతని మాట వినిపించుకోలేదు.

సాయంత్రం అయిదున్నర అవుతుండగా డాక్టర్ దిగాడు. హడావిడి మరింత ఎక్కువయింది. అయితే ఆపరేషన్స్ చేసే సూచన కనిపించలేదు రామ్మూర్తికి. ధైర్యం చేసి ఓ కార్యకర్త దగ్గరి కెళ్ళి

"బాబూ! డాక్టరుగారొచ్చారుగా ఇంకా ఏమిటి ఆలస్యం?" అన్నాడు భయపడుతూనే.

"అయ్యా!ఇదీ ఆలస్యం!"అని తమరితో చెప్పుకోవాలా? చాల్చాల్లేవయ్యా! ఊరికే చేయించుకోవడానికే అంత తొందర పడిపోతావేమిటి? ..." అంటూ కొట్టినంత పని చేశాడతను.


"అదికాదు బాబూ!...."

"ఏది కాదయ్యా.... ఓ మూల ఫొటోగ్రాఫర్ రాలేదని మేం ఛస్తుంటే మధ్య నీ గోలేమిటి? అంత ఉండలేని వాడివి వెళ్ళిపో! మా ప్రాణాలెందుకు తీస్తావ్!" అంటూ ఓ కసురు కసిరి వెళ్ళి పోయాడతను.

రామ్మూర్తి కళ్ళలో నీళ్ళు తిరిగాయి! ఎక్కడో దాక్కున్న అభిమానం

## వశీకరణం

కావ్యాత్మపు స్త్రీత్వం
మూర్తీభవించిన నీ కళ్ళ స్పర్శ
ఏ క్షణం నన్ను తాకుతుందో
ఎందుకు నా విషాద వ్యాధిగ్రస్థ
హృదయ కపోతాన్ని చల్లగా నిమిరి
ఆశల అంబరం పైకి ఎగరేస్తుందో
తెలీదు—
ఆ కళ్ళ వాకిళ్ళ ముందు



అలల్ని విసరటం మరచిన
గంభీర సముద్రంలా
ఎందుకు ఎదురు చూస్తానో
తెలీదు—
నువ్వూ నాకు తెలీదు
నీ శిరీష కుసుమ శరీర
సౌందర్యాకృతి గుర్తించలేను—
నాకు తెలిసింది ఒక్కటే
పార్థుడికి పక్షికన్నే కన్పించినట్లు
నా ఏకాగ్రతనంతా
నీ కళ్ళు వశీకరించుకోవడం—
వినీలాకాశంలా నా
ప్రపంచాన్ని ఆవరించుకోవటం—
స్పర్శాస్నపిత జీవరస గంగలై
సాహిత్య ఝురులు పొంగటం.

—శైలకుమార్

తన్నుకొచ్చింది. వళ్ళ బిగువున మరో గంట వుండి ఉసూరు మంటూ ఇల్లు చేరుకున్నాడు.

"అదేమిటి నాన్నా!" అప్పుడే వచ్చేసిన తండ్రిని ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది దేవకి.

"లాభం లేదమ్మా!... దూరపు కొండలు నునుపు! అయినా అవి మన లాంటి వాళ్ళకొక్కాదమ్మా!.... మన బ్రతుకులు మరీ అధ్వాన్నం! అటు పెద్దవాళ్ళలా జీవించనూలేము. ఇటు చిన్న వాళ్ళలా అడ్జెస్ట్ కానూ లేము! మధ్య తరగతి మంద భాగ్యులమమ్మా మనం!....తిండికి లేకపోయినా అదేమిటో నాలో అభిమానం మాత్రం చావడం లేదు!" కండువాతో కళ్ళు ఒత్తుకుంటూ అన్నాడు రామ్మూర్తి.

ఇటీవల మాటకు ముందు ఏడుపొచ్చేస్తోందాయనకి.

"పోన్లెండి నాన్నా!...ఇక్కడే చేయించుకుందురు గానీ రేపు పెన్షన్ డబ్బు రాగానే. అయినా అలాంటి కేంప్‌లో ఆపరేషన్ అంత మంచిది కాదు కూడాను!" అనునయింపుగా అంది దేవకి.

ఆమెకి తండ్రి స్థితి చూస్తుంటే దుఃఖం ఆగడం లేదు. కూతురి అనునయపు మాటలు విన్న రామ్మూర్తి అదోలా నవ్వాడు.

"నాన్నా! డాక్టర్ రవీంద్ర ఆపరేషన్స్ బాగా చేస్తాట్ట. ఆయన దగ్గర చేయించుకుంటే!" అంది దేవకి.

## మార్పు

కనురెప్ప కదిలేలోగా
ఈ లోకంలో ఎన్నో వింతలూ
విడ్డూరాలు
జరుగుతున్నాయి నిత్యం
అందుకే అది నిత్యసత్యం!
కాని, మనిషికి
కనువిప్పు కలిగేలోగా
ఎన్నో నష్టాలు, కష్టాలు
దొర్లుతున్నాయి అతని జీవితంలో
కనుకనే యిది జీవన సత్యం!

—రజని

"కానీ, ఆయన చాలా డబ్బు తీసుకుంటాట్టమ్మా!" నీరసంగా అన్నాడు రామ్మూర్తి.

"కానీ తప్పదుగా! మీ కన్ను బాగైతే మీ విద్యార్థులే మీ దగ్గరికొస్తారు!.... ఎలాగో ఆయన దగ్గరే చేయించుకోండి నాన్నా!"

"అలాగే కనుక్కుంటాను!" అన్నా రామ్మూర్తి.

మర్నాడు కనుక్కొని ఉసూరుమంటూ వచ్చాడు.

"డాక్టర్ రవీంద్ర ఒక కన్ను ఆపరేషన్ చేస్తే రెండు వందలు తీసుకుంటాట్ట!....అది కాక మందులకీ వాటికి ఇంకా అవుతుందట!" అన్నాడు దిగులుగా.

దేవకి కూడా దిగులు పడి పోయింది.

"కానీ...డాక్టర్ నరేంద్ర అని గవర్నమెంటు డాక్టరున్నాడు. ఆయన కూడా బానే చేస్తాడట!....యాభై రూపాయలిస్తే హాస్పటల్లో తనేస్వయంగా చేస్తానన్నాడు. అయినా ఇదేమంత పెద్ద ఆపరేషన్ కాదట! అక్కడే చేయించుకుంటే పోలా!" అన్నాడు రామ్మూర్తి.

దేవకి క్షణం ఆలోచనలో పడింది.

ఇద్దరూ కాసేపు ఆలోచించుకొని పెన్షన్ డబ్బు రాగానే హాస్పటల్లో ఆపరేషన్ చేయించాలని నిర్ణయించుకున్నారు.

o o o

పెన్షన్ వచ్చిన రోజునే ఆలస్యం చెయ్యకుండా డాక్టర్ నరేంద్ర దగ్గరికెళ్ళి మాట్లాడి యాభై రూపాయలూ ఆయనకిచ్చాడు రామ్మూర్తి.

"మీకేం ఫరవాలేదు మాస్టారూ! రేపే మీకంటి ఆపరేషన్. మీరు నిశ్చింతగా ఉండండి!" అన్నాడు డాక్టర్ యాభై రూపాయల నోటుని సున్నితంగా జేబులో పెట్టుకుంటూ.

అనుకున్నట్టు రామ్మూర్తి కంటి ఆపరేషన్ నిర్విఘ్నంగా అయిపోయింది. కట్టుకడుతూ డాక్టర్.


"ఇదిగో! మాస్టారూ! జాగ్రత్తగా ఉండండి. ఏమీ నమలకూడదు. దగ్గకూడదు! బీకేర్‌ఫుల్! లేకపోతే కంటికే ప్రమాదం!" అంటూ కొన్ని జాగ్రత్తలు చెప్పాడు.

"అలాగేనండి!" అన్నాడు రామ్మూర్తి వినయంగా. మందులకనీ, వార్డ్‌బోయ్‌కనీ, హెల్ప్ చేసిన నర్స్‌కనీ మరో పాతిక కర్చయిందాయనకి. అయినా బాధ పడ లేదు.

"వందలు అవుతుందనుకున్న ఆపరేషన్ తేలిగ్గానే అయిపోయింది! కన్ను బాగుపడితే గానీ ఆ డబ్బు ఎలాగో సంపాదించుకోవచ్చు!" అన్న ధీమా వచ్చిందాయనకి. అందుకే పెన్షన్ డబ్బులోంచి ధారాళంగానే ఖర్చుచేశాడు.

o o o

ఆ రోజు రామ్మూర్తి కంటి కట్టు విప్పారు ముందు మసగ్గా కనిపించి ఆపై



కొంచెం మెరుగయింది.

రామ్మూర్తి తెగ ఆనందపడిపోయాడు. డాక్టర్‌కి ఎన్నో కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

డాక్టర్ ఆయనకి ఐ షేడ్ ఇస్తూ—

వేడి చేసే వస్తువులు తినొద్దనీ. కంటికి స్ట్రెయిన్ ఇవ్వద్దనీ. క్రమేపీ చూపు మెరుగవుతుందనీ, ఇరవై రోజుల తరవాత వస్తే కళ్ళ అద్దాలు రాసిస్తాననీ .. ఇంకా చాలా జాగ్రత్తలు చెప్పాడు.

ఇంటి కొచ్చాక అర్ధాకలితో తిన్నా. ఆ తండ్రీ కూతుళ్ళకి అంత బాధగా లేదు. 'కన్ను బాగయింది! అంతే చాలు!' అన్న తృప్తి కొండంత శక్తి నిచ్చింది వాళ్ళకి.

మళ్ళీ ఏఏ టైమింగ్స్‌లో ట్యూషన్స్ చెప్పాలో ఎవరెవరికి రమ్మని కబురు చెప్పాలో, తనంటే బాగా నమ్మకం ఎవరికుందో ఆలోచిస్తూ పడుకున్నాడు రామ్మూర్తి.

మూడు రోజులు గడిచి పోయాయి!

రామ్మూర్తి కంటిలో సన్నని పోటు ప్రారంభమైంది. రెండు రోజులు అదే తగ్గుతుందిలే అని చూశాడు కానీ తగ్గలేదు సరికదా బాధతో పాటు కంటినుంచి నీరు కారడం ప్రారంభమైంది. కంగారు పడి డాక్టర్ దగ్గరికి పరిగెత్తాడు.

ఆయన చూసి ఏం భయం లేదని. ఇవి వాడమనీ కొన్ని మందులు రాసి ధైర్యం చెప్పి పంపాడు.

మరో నాలుగు రోజులు గడిచి పోయాయి రామ్మూర్తి కంటి పరిస్థితి మరీ దారుణంగా తయారయింది.


• కన్ను నెత్తురు ముద్దలా ఎర్రగా అయి పోయింది. కంటి నుంచి నీరు ఆగకుండా కారుతూనే ఉంది పోటు మరింత ఎక్కువ అవడమేగాక జ్వరం కూడా మొదలైంది.

మళ్ళీ డాక్టర్ దగ్గరి కెళ్ళాడు.

"వెధవ యాభై రూపాయలకి గాడిద చాకిరి" అనుకుంటూ విసుక్కుంటూనే చూశాడాయన.

ముఖాన్ని చిరాగ్గా పెట్టి—

"మందులన్నీ నేను చెప్పినట్టు వాడలేదా?" అన్నాడు




"వేసుకున్నానండి!" వినయంగా అన్నాడు రామ్మూర్తి.

"అయితే వేడివస్తువులుబాగాతిన్నారా!"

"లేదండి! మజ్జిగన్నం తప్ప.... ఏం తిన్లేదు!"

"అయితే ఈ కన్నెందుకిలా తయారయింది?" కొట్టినట్టే అన్నాడు డాక్టర్.

బిత్తర పోయాడు రామ్మూర్తి.

"ఏమయింది డాక్టర్ గారూ?" అన్నాడు భయంగా.

"ఏం లేదు లేండి! ఇదిగో ఈ టేబ్లెట్స్ పదిరోజులు రోజుకు మూడు చొప్పున వాడి. ఆ తర్వాత కనిపించండి!" అంటూ పంపేశాడు డాక్టర్.

* * *

పదిరోజులు అతి భారంగా గడిచి

## జీవన మజిలీ

వీచే వడగాలినైనా
భరిస్తాను ప్రియా!
దహించే ఆకలినైనా
తట్టుకుంటాను చెలీ!!
అఖరికి—
కడు పేదరికమైనా
అనుభవిస్తాను సఖియా!!!
కాని;
నా హృదయంలో,
నా జీవితంలో
తోడుగా, చిరస్థాయిగా
నీవుంటేనే సుమా! —వరలక్ష్మి

పోయాయి. బాధ భరించలేని రామ్మూర్తి ఇంటికెడితే ఎక్కడ విసుక్కుంటాడో అని హాస్పటల్ కెళ్ళాడు.

ఆ రోజు డాక్టర్ నరేంద్ర శలవు పెట్టాడు. మరో డాక్టర్ ఆయన కన్ను చూశాడు.

"కన్ను సెప్టిక్ అయి చెడిపోయింది. గుడ్డు మొత్తం తీసెయ్యాలి. ఎంత తొందరగా తీస్తే అంత మంచిది! లేకపోతే రెండో కన్ను కూడా పోయే ప్రమాదముంది!" అన్నాడు డాక్టర్.


కొయ్యబారి పోయాడు రామ్మూర్తి. ఏదో అడగబోతుంటే—

"ఒకొక్కళ్ళ దగ్గరా ఇంత సేపుంటే ఆ క్యూ తరిగేదెలాగయ్యా!" అంటూ ఒక్క గదుము గదిమాడా డాక్టర్. కాళ్ళీడ్చుకుంటూ ఇల్లు చేరాడు రామ్మూర్తి.

మంచం మీద పడి భోరున ఏడుస్తున్న తండ్రిని చూసి నిర్ఘాంత పోయింది దేవకి.

"ఏమిట్నాన్నా? ఏమయింది?" అంది కంగారుగా. "నా కన్ను నా కన్ను పోయిందమ్మా! పూర్తిగాపోయిందమ్మా!" పసివాడిలా చేతుల్లో ముఖం దాచుకుని భోరుమన్నాడు రామ్మూర్తి.

దేవకి బిగుసుకుపోయింది. రెండు నిమిషాల తర్వాత తేరుకుని మెల్లగా అన్ని విషయాలూ అడిగి తెలుసుకుంది. ఆ పైన ఆయన్ని కన్నతల్లిలా అక్కున చేర్చుకుని ఓదార్చింది.




"మన రోజులు బావుండకపోతే.... అన్నీ ఇలాగే జరుగుతాయి నాన్నా... ఎవర్ననీ ప్రయోజనం లేదు. రెండో కంటినైనా కాపాడుకుందాం పదండి!" అంటూ ఆయనకి ధైర్యం చెప్పి, ఆ సాయంత్రమే డాక్టర్ నరేంద్ర ఇంటికి తీసికెళ్ళింది.

అతను కాస్త తీరిగ్గానే ఉన్నా వాళ్ళని చూసి ముఖం చిట్లించాడు.

విషయం చెప్పింది దేవకి.

"మీరు శలవు పెట్టారటకదా. హాస్పటల్లో మరో డాక్టర్ చెప్పారు!" అన్నాడు రామ్మూర్తి. తన బాధని కడుపులోనే దాచుకుని.

అతనేం మాట్లాడలేదు.

"డాక్టర్ ఈ కన్ను పూర్తిగా తీసెయ్యక పోతే బాధ తగ్గదని. పైగా రెండో కంటి క్కూడా ప్రమాదమనీ ఆయనఅన్నారట. నిజమేనా?...." అంది దేవకి.

"నిజమే!" అన్నట్టు తల పంకించాడు డాక్టర్.

"అసలెందుకిలా జరిగింది డాక్టర్?" కాస్త ఆవేశంగా అంది దేవకి.

"బావుంది! కన్నంటే మాటలనుకుంటు న్నారా? ఎన్నోజాగ్రత్తలు తీసుకోవాలి! అక్కడికీ నేను చెప్పాను! జాగ్రత్తగా ఉండండి అని విన్నారా? ఈయన బాగా కదిలుంటాడు! లేక పోతే ఏ ఆవకాయో తినుంటాడు! ప్చ్! చెప్పిన మాట వినరు కదా!" అన్నాడు డాక్టర్ విసుగ్గా.

అతని మాట వింటుంటే దేవకిక్కి వెర్రి కోపం ముంచు కొచ్చింది. అయినా తనని తాను కంట్రోల్ చేసుకుని —

"అయితే డాక్టర్! కదిలినా, ఆవకాయ తిన్నా సెప్టిక్ అవుతుందా?" అంది సూటిగా.

దానికతను మండిపడ్డాడు.

"అసలు డాక్టర్వి నువ్వా నేనా?" అంటూ సవాల్ చేశాడు.

"అంత అభిమానం ఉన్న వాళ్ళు, రాచ వైద్యం కావాలనుకునే వాళ్ళు ఏ ప్రయివేట్ నర్సింగ్ హోమ్‌లోనైనా చేయించుకోక పోయారా ఇలా మా ప్రాణాలు తియ్యకపోతే!" అంటూ చిందులేశాడు.

ఆవేశం తన్నుకొస్తున్నా పరిస్థితిని మనసులో వుంచుకుని —

"సారీ డాక్టర్! మిమ్మల్ని నొప్పించా లని కాదు నా ఉద్దేశం!.... కారణం తెలుసు కుందామనకే గానంతే!" అంటూ పన్నాలుగు క్షమార్పణలు చెప్పుకున్న తరవాత కాస్త శాంతించాడు డాక్టర్.

"అయినా గవర్నమెంటు డాక్టర్లంటే అందరికీ అలుసే!" అంటూ అనవసరంగా నిట్టూర్చాడు.

ఇదంతా తనకి పట్టనట్టు తల పట్టుకుని అలా నిర్వికారంగా కూర్చుండి పోయాడు రామ్మూర్తి.

"డాక్టర్!" మెల్లగా పిల్చింది దేవకి.

"ఏమిటి!" అన్నట్టు చూశాడతను.

"ఎలాగో కన్ను తీసెయ్యాలన్నారుగా.. రేపు నాన్న హాస్పటల్లో జాయినవుతారు. దయచేసి కన్ను తీసెయ్యండి డాక్టర్!" రెండు చేతులూ జోడించి.... దయనీయంగా అడిగింది దేవకి.

ఆమెకి దుఃఖం కట్టలు తెంచుకొస్తోంది.

"అవును డాక్టర్!.... ఈ బాధ నేను భరించలేను! నా కన్ను తీసెయ్యండి!.... ప్లీజ్!...." చేతుల్లో ముఖం దాచుకుని భోరు మన్నాడు రామ్మూర్తి.


క్షణం ఆలోచనలో పడ్డాడు డాక్టర్.

"రేపు జాయినవమంటారా డాక్టర్?" మెల్లిగా అంది దేవకి.

"అలాగే! ఈ కన్ను తీసినందుకు మరో యాభై రూపాయ లవుతుంది! తరవాత నన్నంటే లాభం లేదు! అంత్య నిష్ఠూరం కన్న ఆదినిష్ఠూరం మేలు." నిజాయితీకి మారుపేరులా మొహం పెట్టి అన్నాడు డాక్టర్.

"డాక్టర్!" అంది దేవకి నిర్ఘాంత పోయి.

"వెరీ గుడ్! చెడ గొట్టడానికి యాభై రూపాయలు, ఆ చెడిన కన్నుని తొలగించ డానికి మరో యాభై రూపాయలు! అంటే... నా మంచి కన్నుని, నా నుంచి దూరం చేయడానికి మీ ఫీజు వంద రూపాయలన్న మాట! ...వెరీ గుడ్! మీ ధర్మసూత్రాలు ఇలాగే వర్ధిల్లాలి!.... మీ డాక్టర్లు ఇంకా వృద్ధిలోకి రావాలి!...." అంటూ పగల బడి నవ్వుతున్న రామ్మూర్తిని చూసి డాక్టరూ, దేవకి కూడా కొయ్యబారి పోయారు.



దీపమాల
గరికపాటి దుర్గ - విజయవాడ